గతం భయంకరంగా భయపెడుతుంది. వర్తమానం శూన్యంగా అగుపడుతుంది. అతడు ఆత్మహత్య చేసికోవాలని అనుకొన్నాడు కాని భవిష్యత్తన్నా అభయహస్తమిస్తుందోనన్న ఆశ. తన కొడుకు పెద్దవాడై పైకొస్తాడని, తమ కష్టాలకు అంతిమ గీతం పాడుతాడని ఎక్కడో మినుకు మినుకుమంటూ ఆశ. తానెన్ని కష్టాలనుభవించినా కొడుకు భవిష్యత్తుకై పూలబాట వేయాలన్న ఆరాటం. కొడుకు భవిష్యత్తుపై, మొత్తం భవిష్యత్తుపై ఏదో తనకే తెలియని ఆశ. భవిషత్తుపై ఆశతోనే తిరుపతయ్య జీవించాలని నిర్ణయించుకొన్నాడు. గతం- వర్తమానం ఎంత చేదుగా ఉన్నా భవిష్యత్తుపై ఆశేలేకుంటే ఎంత మంది తిరుపతయ్యలాంటి నిర్భాగ్యులు మట్టిపాలయ్యేవారో- అందుకే మనిషి ఆశాజీవి.

(రచ్చబండలో ముద్రితము)

# 9. మాతృమూర్తి

ఈమధ్య చాలారోజులయింది కలంపట్టి. మనస్సు కాస్త ఉల్లాసంగా ఉంటే కలం, కాగితం చేతబట్టుకొని కుర్చీలో కూర్చున్నాను. మనసులో ఎన్నెన్నో ఆలోచనలు గజిబిజిగా అల్లుకుంటున్నాయి. తీరా కలంతెరిచి అక్షరరూపంలో పెడ్దామంటే ఏంపెట్టాలో ఎలా పెట్టాలో అర్థంకావడంలేదు. కథావస్తువుకొరకు దీర్ఘాలోచనామగ్నుడనైయున్ననాకు ప్రక్క

యింటినుండి భూషణరావుగారి కంచుకంఠం గంటలా విన వచ్చింది. 'బుద్ధిలేదే నీకు ఎన్నిసార్లు చెప్పాలి ఛూ' అంటూ ఎందుకోగాని చీదరించుకొంటున్నాడు. అంతలో సన్నగా ఏడుస్తున్న ధ్వని వినవచ్చింది ఆ కంఠం నాకు చిరపరిచి తమే. వసంత వెక్కి వెక్కి ఏడుస్తున్న ధ్వని నా కర్ణ పుటాలను సోకింది. విషయమేమిటో తెలుసుకుందామని, కలం కాగితం కుర్చీలో పడవేసి లేచునంతలో వసంతే ఏడ్చుకుంటూ నా దగ్గరకు వచ్చింది. 'బాబాయ్, నేనేం తప్పుచేసినాను? నాన్న నన్ను తిడుతున్నాడు? బాబాయ్, సుమవాళ్లు బలవంతంచేస్తే సినిమాకు పోయొచ్చాను. ఇదితప్పా బాబాయ్? నేను సినిమా చూడకూడదా?' అని హృదయవిదారకంగా ఏడ్వసాగింది. ఆమె ఏడ్పు చూస్తున్న నాకు ఆమె గతం జ్ఞాపకం రాసాగింది.

భూషణరావుగారిది శుద్ధ శ్రోత్రియ కుటుంబం. పూర్వా చారాలకు పూర్తిగా మద్దతు నిస్తారు. మడి, పూజ, త్రికాల సంధ్యావందనాలు లేనిదతడు ఒక్కరోజైనా గడుపలేడు. ఆతని పుత్రికే వసంత ఆమెను అల్లారుముద్దుగానే పెంచారు. ఆడవానికి చదువెందుకని అనుకున్నాడు కాని, మంచి భర్త దొరకాలంటే కొంతవరకైనా చదువుండాలని నిర్ణయించు కొని ఊళ్లోవున్న పదవ తరగతివరకు చదివించాడు. వసంత స్వతహాగా చురుకైన పిల్ల. లేత వయస్సునుండే ఆమెకు ప్రపంచ అవగాహన ఎక్కువ. ప్రతి విషయాన్ని నిశితంగా విమర్శించేది. తన అన్న పట్నంలో కాలేజీలో చదివేవాడు

అతడింటికి వచ్చినపుడు శరత్, లత, చలం మొదలగు ప్రఖ్యాత రచయితల నవలలు తెచ్చేవాడు. తెలివైనదైన వసంతకా రచనలు ప్రపంచాన్నిగూర్చి తెలుసుకోవడానికి మరింత దోహదం చేసాయి. వితంతు వివాహాలనుగూర్చి, వరకట్న దురాచారంగూర్చి, ఆమెకు నిర్దుష్టమైన అభిప్రాయాలుండేవి. ఆమె ప్రతి విషయాన్నిగూర్చి క్షుణ్ణంగా చర్చించేది. ఆమెకేదైనా సందేహం వచ్చినపుడు నాదగ్గరకు వచ్చేది. ఆమెకుగల సునిశిత విమర్శనాశక్తికి నేనుముగ్ధున్నయ్యేవాణ్ణి ప్రక్క ఇల్లే అవడంవల్ల చిన్నప్పటినుంచీ ఆమె నాకు తెలుసు. బాబాయ్ బాబాయ్ అంటూ నాపై విరుచుకపడ్తూ ఎన్నెన్నో ప్రశ్నలతో నన్ను వేధించేది. బాల్యంనుంచీ ఆమె బొమ్మరిల్లాట, దాగుడుమూత లాడుకొన్నపుడు తాను తల్లిగా ఉండేది. అందాల బొమ్మను ఎత్తుకొని ఏడ్పు మానమని, బిస్కెట్లు చాక్లెట్లు కొనిస్తానని తాను తల్లియైనట్లు, ఆ బొమ్మ తనకు బిడ్డయైనట్లు ఓదార్చేది. నిద్రపో అమ్మ నిద్రపో అంటూ బొమ్మను తన హృదయానికి హత్తుకొని నిద్రపుచ్చేది. బిడ్డను ఒడిలో పెట్టుకొని స్తన్యమిస్తున్న తల్లిని చూస్తుంటే ఆమె పరవశించేది. ఈ వింత ప్రవర్తనే క్రమక్రమంగా ఆమెది మాతృత్వంపై గాఢమైన ప్రేమగా మారింది. ఆమె అలవాట్లను చూసిన ఆమె స్నేహితురాళ్ళు ఆమెకు కుచేల సంతానం కలుగుతుందని ఆటపట్టించేవారు. వయస్సు వస్తున్నకొలదీ ఆమె వయస్సు, ఆమె ఒళ్ళు మిరుమిట్లుగొలిపే అందంతో

అప్సరసలా తయారయ్యింది. నిండుగా చీరతో, నుదుట కుంకుమతో, కళ్ళకు కాటుకతో ఆమె లక్ష్మీదేవిలా అగుపించేది. మెట్రిక్యులేషన్ తర్వాత ఆమెకు పెళ్ళిసంబంధాలు చూడసాగారు. తనకు పెళ్ళిచూపులని తెలిసినపుడామె లేడిలా గంతులేస్తూ నాదగ్గరకు వచ్చింది. సిగ్గుతో చెప్పింది. ఆమెకు నా దగ్గర ఏం దాపకాలులేవు. తన తండ్రివద్దకూడ మాట్లాడలేని ఎన్నో విషయాలు నాతో మాట్లాడేది. సాక్షాత్తు లక్ష్మీదేవిలా ఉన్న ఆమెను పెండ్లాడబోయే యువకుడు అదృష్టవంతుడనుకొన్నాడు. తర్వాత ఆమెకు వైభవోపేతంగా పెళ్ళి జరిగింది. ఏ విఘాతంలేని ముహూర్తంలో అనుకున్న సమయానికి పెళ్ళి జరిపించిన భూషణరావు నందరూ కొనియాడారు. పెళ్ళి తర్వాత ఆమె అత్తవారింటికి వెళ్తున్నప్పుడు తల్లిదండ్రులను, పుట్టిపెరిగిన ఊరును వదలిపోతున్నానన్న విచారం కొంచెం ద్యోతకమయినా, భర్తతో కలిసి వెళ్తున్నందుకు సంతోషమే ఎక్కువగా కన్పించింది. నుదుట ఎర్రని కుంకుమతో, కళ్ళకు కాటుకతో, లేత గులాబిరంగు చీర, అదే కలర్ జాకెట్టు వేసుకొని నావద్దకు వచ్చి ఆశీర్వదించుమన్నపు డామెను 'దీర్ఘ సుమంగళీభవ— శీఘ్రమేవ సంతానప్రాప్తిరస్తు' అంటూ ఆశీర్వదించాను. కాళ్ళకు మట్టెలు, మెడలో తాళిబొట్టు ఆమెకు మరింత నిండుదనాన్నిచ్చాయి.

చిలకా గోరింకల్లా ఉన్న ఆ జంటను చూచిన విధికి

కన్నుగుట్టింది. ముక్కుపచ్చలారని ఆ ముగ్ధను సంసార జీవితమంటే ఏమిటో తెలియని విధవగా మార్చేసింది. పెళ్ళి వారితో వరుని యింటికి యేగుచున్న బస్సు ప్రమాదానికి గురైంది. పెళ్ళికుమారునితోసహా చాలామంది ఆ ప్రమాదం లో మరణించారు. కాని వసంత చిన్న గాయాలతో బయట పడ్డది. భర్త అంత్యక్రియల సమయంలో ఆమె ఏడ్చిన హృదయవిదారకమైన ఏడ్పు ఎంతటి బండరాతినైనా కరిగిస్తుంది. ఏడ్చియేడ్చి ఆమెసొమ్మసిల్లి పోయింది.

తర్వాత తేరుకొని చూసేసరికల్లా అంతా అయిపోయింది. తన భర్త మంటల్లో ఆహుతైపోయాడు. ఆమె ఆకారానికి నిండుదనాన్నిస్తున్న, మట్టెలను, మంగళసూత్రాన్ని తీసివేసారు. ఏడ్చి ఏడ్చి ఆమె పిచ్చిపట్టినదానిలా తయారయ్యింది. గాజులు, కాటుక, బొట్టు చెరిపివేయాలన్నారు. ఆమె ఉగ్రరూపం దాల్చింది. భర్తతో స్త్రీకి లభించేది మంగళసూత్రము, మట్టెలు మాత్రమే. పెళ్ళికాక ముందునుంచి ఉంటున్న గాజులు, బొట్టు తీసివేయడానికి వీలులేదన్నది. ఆమె మాటలు విన్న అందరూ నిశ్చేష్టులయ్యారు. ఆమెకు మతిభ్రమణం కలిగిందనీ, ఆమె మాటలు లెక్కచెయ్యకూడదని, అందరూ కల్సి గాజులు, బొట్టు బలవంతంగా తొలగించారు.

తనకు తోచిన మాటలు సమయాసమయాలు చూడకుండానే అనే స్వభావం కల వసంత అంతటి దుఃఖంలో

కూడా ఆ మాటలన్నది. ఆమె ఆ మాటలు ఏ సమయంలో అన్నప్పటికీ ఆమె మాటల్లో నగ్నసత్యమున్నది. పుట్టినప్పటి నుంచీ స్త్రీకి సౌభాగ్యాలైన గాజులు, బొట్టు భర్త మరణంతో తొలగించడంలో అర్థంలేదు. కాని ఆమె మాటలు వినేదెవ్వరు?

ముక్కుపచ్చలారని బిడ్డను గాజులు, బొట్టు, కాటుక అన్ని అలంకారాలనూ తీసివేసి, తెల్లచీర కట్టిస్తూ ముసలమ్మలా తయారుచేసారు. ఆమె బయటుకు పోవడానికి వీలు లేదు. సినిమా చూడకూడదు. ఏ కోర్కె కోరుకోగూడదు. ఆమె జీవిత మంతటితో ముగియవలసిందేనా? ఆమెనుచూసినప్పుడు నా హృదయం తరుక్కుపోయేది. ఆమె అప్పుడప్పుడు మా ఇంటికితప్ప ఎక్కడికి వెళ్ళేదికాదు. ఆమె మాటలనుబట్టిచూస్తే ఆమెకు మాతృత్వంపై కోర్కె ఇప్పుడుకూడ బలీయంగానే ఉందనిపిస్తుంది. కాని ఆమెకు పునర్వివాహం చేయడం అసంభవం. ఆమె తల్లిదండ్రులు శుద్ధ ఛాందసులు. ఆమె రాత బాగులేనందుకు భర్త మరణించాడు. అది ఆమె దుష్కృతఫలం. దాని కెవ్వరేం చేయగలరు? ఆమె జీవితాంతం అలాగే గడుపాల్సిందే. ఇదీ వారి వాదం. వేరే కులాలలో ఐనచో ఆమెకు పునర్వివాహం జరిగేది కాని ఆమె తండ్రిది అగ్రకులం. పునర్వివాహం చేసికొనుట అలగా కులంవారి లక్షణమని ఆయన అభిప్రాయం. కాని భార్య మరణించినచో నెల తిరుగకముందే మగవాడు పునర్వివాహం చేసుకొంటాడు. అట్లాంటి హక్కు ఆడదాని కెందు

కుండకూడదు? హరిజన యువతి భర్త మరణిస్తే తిరిగి పెళ్ళి యింది. కాని వసంత కామాట ఎత్తడానికి వీల్లేదు. తాను మూలగానైనా జన్మించక పోతినని ఆమె వాపోయేది.

ఆలోచనామగ్నుడనై యున్న నన్ను వసంత కుదిపి 'బాబాయ్, నీకుకూడ నాపై కోపంగా ఉందా? నేనేంపాపం చేసాను బాబాయ్? అందరూ నన్ను చీదరించుకొంటు న్నారు' అన్నది వెక్కి వెక్కి ఏడుస్తూ. అప్పుడు నేనీ లోకంలో పడ్డాను. ఆమె నేమని ఓదార్చాలో, ఎలా నచ్చజెప్పాలో నాకర్థం కావడంలేదు. సందిగ్ధావస్థలో పడి మాట్లాడకుండ యున్న నన్ను జూచి- 'బాబాయ్, నాకు సమాధానం చెప్పరా బాబాయ్. పెళ్లి అయీకాకముందే భర్తపోతే నేను బాధ్యురాలినా? నన్ను ముదనష్టపు ముండ, దరిద్రపుముండ అని తిడుతే పడుతూ ఊర్కోవాలా? నా విధివ్రాత మంచిది కాదట. నేను పూర్వజన్మలో పాపంచేసికొన్నానట. అందుకే నాకీ వైధవ్యం ప్రాప్తించిందట. అసలు నేను చేసిన పాప మేమి బాబాయ్? సంసార జీవితమంటే తెలియకముందే నన్ను విధవని, గాజులు మట్టెలు తీస్తే సహించి ఊర్కొ న్నాను. తెల్లబట్టలు కట్టి మునలమ్మలా మూలకు కూర్చొ బెడితే సహించి ఊర్కొన్నాను. నేనే పేరంటానికి వెళ్ళవద్దని అలంకారాలు చేసుకోవద్దంటే ఊర్కొన్నాను. పసివయసు లోనే భర్త చనిపోతే జీవితాంతం ఇలా అనుభవించాల్సిం దేనా? నాకే కోర్కెలు, ఆశలు ఉండకూడదా బాబాయ్?

సంఘాన్ని, ధర్మాన్ని కాపాడుతామని చెప్పుకునే ఈ అగ్రకులంవారు భార్య చనిపోతే ఎందుకు పెళ్ళిచేసుకోవాలి? ఆడదానికొక న్యాయం- మగవాడికి వేరొక న్యాయమా? అన లీ కులవ్యవస్థ ఏమిటే బాబాయ్? ఎన్ని విధాల హింసించినా భరిస్తూ ఒక్కరోజు సినిమా కెళ్ళినంత మాత్రాన మా నాన్నగారి పరువు ప్రతిష్ఠలు పోతాయా బాబాయ్? వాళ్ళు తిట్టినట్లూ నేనెందుకు పడాలి? నేను మళ్ళీ పెళ్ళెందుకు చేసికోకూడదు?' ఆవేశంగా అని నావైపు చూడసాగింది.

ఆమె మాట్లాడిన ప్రతి మాటలోను వాస్తవ మున్నది. బూజుపట్టిన మూఢాచారాలపై, కులవ్యవస్థపై ఆమె దాడిచేస్తానంటున్నది. పాతబడి ముసిగిపోయిన సంఘం కట్టుబాట్లు నామె నధిగమించడానికామె వెనుకాడటంలేదు. నేనీ ప్రశ్నలన్నింటికి ఏమని సమాధానం చెప్పాలి? అభ్యుదయ రచనలు చేస్తూ సంఘంలోని మూఢాచారాలను ఖండిస్తున్నవాడిని. అందరివలెనే నేనుకూడా కోర్కెలను పెంచుకుంటూ జీవచ్ఛవంలా పడియుండమని సలహా నివ్వనా? లేక సంఘానికి తిరుగబడి పునర్వివాహం చేసికొమ్మని చెప్పనా? ఆమె కోరిన కోర్కెలలో ఏమాత్రం అసహజత్వంలేదు. పైగా ప్రతికులం వారు పునర్వివాహం చేసికొంటున్నారు. అగ్రకులమని చెప్పుకునే ఈ బ్రాహ్మణులుమాత్రం తామేమో ధర్మరక్షకులైనట్లు నిరసిస్తున్నారు. సత్యంకొరకు పోరాడుతూ సంఘాన్నెదురించనా? లేక సంఘానికి భయపడి కాళ్ళ పారాణియైన అరక

ముందే వైధవ్యం ప్రాప్తించిన ఒక అబల జీవితం అన్యాయ మౌతుంటే చూస్తు ఊర్కోనా? ఇదమిద్ధమని నిర్ణయించుకో నక ముందే మళ్ళీ వసంత అంది- 'బాబాయ్, నీవు రచయి తవు. జీవితాలను కాచి వడబోసినవాడవు. నాకొక మార్గం చూపించవా?' అని కాళ్ళమీద పడ్డది.

ఇన్నిరోజులు పునర్వివాహంపై, సంఘ దురాచా రాలపై రచనలు సాగించానేకాని ఇలా ప్రత్యక్షంగా సమ స్యనెప్పుడూ ఎదుర్కోనలేదు. ఊర్కే రచనలుచేస్తు ఇలాంటి సమస్యలెదురైనప్పుడు తప్పించుకోవడం న్యాయంకాదు. బాగా ఆలోచించాను. అంధకారబంధురమైయున్న ఆ అమ్మా యి బ్రతుక్కు ఒక వెలుగు చూపించాలనుకున్నాను. కాళ్ళ పైనున్న వసంతను నెమ్మదిగా పైకెత్తి తల నిమురుతూ- 'అమ్మాయ్, నీకు మళ్ళీ పెళ్ళిచేసుకోవాలని ఉందా?' అని ప్రశ్నించాను.

'బాబాయ్, చిన్నప్పటినుంచీ నాకు పిల్లనెత్తుకొని స్తన్య మిచ్చే మాతృమూర్తిని చూస్తుంటే పవిత్ర భావమున్నది. అదే క్రమముగా వయసు వస్తున్నకొలదీ మాతృత్వంపై ప్రేమగా పరిణమించింది. అది తప్పా బాబాయ్- ఒక స్త్రీ మాతృమూర్తి కావాలనుకోవడం దోషమా? అని ప్రశ్నించింది.

'నీవు కోరుకున్న దాంట్లో ఏం తప్పులేదు. కాళ్ళ పారాణి ఆరకముందే పసుపు కుంకుమ మట్టిలో కలిసినా నీ జీవితం శాశ్వతంగా ఇలా ఉండడానికి వీల్లేదు. నీ జీవితంలో

వసంతం మళ్ళీ రావాలి. అందుకు నేనేమైనా చేస్తానమ్మా-' అని 'వసంతా, నీవు మళ్ళీ పెళ్ళిచేసుకుంటూనంటె నాన్నగా రెలాగు ఒప్పుకోరు. నీ మనసులో ఎవరైనా ఉంటే చెప్పమ్మా, రిజిష్టర్ మ్యారేజి చేయిస్తాను. తర్వాత మీ నాన్నగారొప్పు కున్నారో సరే, లేనిచో పట్నంలో ఎలాగో బ్రతుకుతారు-' అన్నాను. నా మాటలకు వసంత ముఖంలో వేయిజ్యోతులు వెలిగాయి. ఆకలితో అలమటిస్తున్నవారికి పంచభక్ష్య పరమా న్నం దొరికినట్లు నడి ఎడారిలో పయనించేవానికి ఒయాసి స్సులా నామాట లామెకు సంతోషాన్నిచ్చాయి

"బాబాయ్, మీరెంత మంచివారు. మీకుగాక నేనె వరికి చెప్తాను? గోపి నేను ప్రేమించుకున్నాము. గోపి ఎవరో మీకు తెలియదనుకుంటాను. గోపి అన్నయ్య స్నేహితుడు. అన్నయ్య సెలవులకని వచ్చినపుడు అన్నయ్యతో అప్పుడ ప్పుడు వచ్చేవాడు. నా స్థితినిజూచి జాలి చెందేవాడు. నేనొ ప్పుకుంటే తప్పకుండా పెళ్ళిచేసుకుంటూనన్నాడు. ఎవ్వరు లేని సమయంజూచి నాతో ఒంటరిగా మాట్లాడేవాడు. అతని మాటలు నమ్మి నాసర్వస్వాన్నతని కర్పించాను. గోపి నన్ను తప్పక పెండ్లాడుతాడు. నాకిప్పుడు మూడో నెల" అన్నది వసంత బాధగా. చాలామంది ఆడపిల్లలవలెనే వసంతకూడ మగవాడి మాయమాటలు నమ్మి మోసపోయింది. ఈ సమస్య నెలాగైనా పరిష్కరించాలి అని నిర్ణయించుకొన్నాను.

'ఎంతపని చేశావమ్మా, అంత విజ్ఞతగల నీవే ఇంత

తొందరపడ్డావు. సరే, నేను గోపిని కలిసికొని మాట్లాడుతాను. నీ వింటికి పో. ఈ విషయ మెవరితోనూ చెప్పకు' అని అడ్రస్ తీసికొన్నాను.

తర్వాత నేను పట్నంపోయి గోపితో ఈ విషయాన్ని గూర్చి చర్చించాను. కాని గోపి తనకేమి తెలియదని, తన కామెతో ఏసంబంధం లేదనీ, విధవను పెండ్లాడేందుకు సుము ఖంగా లేననీ ఖచ్చితంగా చెప్పేశాడు. అతని కెన్నో విధా లుగా నచ్చజెప్పాను. కాని ససేమిరా ఒప్పుకోలేదు.

వసంత అమాయకత్వాన్ని, మాతృమూర్తి కావాలన్న బలహీనతను ఆధారంగా జేసికొని గోపి ఆమెను మోసగిం చాడు. అతని మాయమాటలు నమ్మి ఆమె తన సర్వస్వాన్న ర్పించింది. ఇందులో ఇద్దరిదీ తొందరపాటున్నది. కాని లోకం దృష్టిలో స్త్రీ ఒక్కతే శిక్షార్హురాలు. మగవా డెన్నివిధాల తిరి గినా ఫర్వాలేదు. పైగా అతడు మగమహారాజు. కట్టుబా ట్లన్నీ స్త్రీకే. పోగా గోపీ తప్పుచేసినట్లు ఋజువేది? ప్రకృతి కూడ స్త్రీపట్లనే అన్యాయం చేసింది.

పరిపరి విధాల ఆలోచిస్తూ ఇంటిముఖం పట్టాను. ఇల్లు చేరుకోగానే పిడుగులాంటి వార్త విన్నాను. వసంత ఆత్మ హత్య చేసికొందట. నేను ఉదయం పట్నం పోతున్నపుడు వసంత నా దగ్గరకు వచ్చింది. నేను పట్నం బయలుదేరగానే ఆమె తమ యింటికి వెళ్ళింది. ఇంటికి పోయినతర్వాత ఆమెకు వాంతి వచ్చిందట. అనుమానించిన తల్లి ఆమెను నిలదీసి

అడుగగా తనకు మూడవ నెల అని చెప్పిందట వసంత. గోపీ పేరు విన్న వసంత అన్న వాడుట్టి తిరుగుబోతనీ, వాడెట్టి పరిస్థితిలోను వసంతను పెళ్ళిచేసుకోడనీ చెప్పాడట. విషయం తెలిసికొన్న భూషణరావు ఉగ్రుడై 'పాపిష్ఠిదాన, నా కడుపున చెడబుట్టావు. విధవవైన నీకు పెళ్ళి ఎలా జరుగుతుందనుకున్నావ్? ఇది మన వంశ ప్రతిష్ఠకే భంగకరం. ఎనిమిదేళ్ళప్పుడే విధవయైన మా అక్కయ్య పెళ్ళి ప్రసక్తి ఎత్తిందా? ఛీ దుర్మార్గురాలా! నిన్నేంచేసినా పాపంలేదు' అని నోటికొచ్చినట్లు తిడుతూ, ఇష్టంవచ్చినట్లు కొట్టాడట. అందరి ఛీత్కారాలను, తన అన్న మాటలతో గోపీ చేసిన మోసాన్ని అర్థంచేసికొన్న వసంత నా రాకకొరకుకూడ ఎదురుచూడకుండానే బావిలో దూకి ఆత్మహత్య చేసికొంది.

వసంత కథ ముగిసింది. మాతృమూర్తి కావాలన్న తన కోర్కెను నెరవేర్చుకోకుండానే తన జీవితాన్ని చాలించుకొన్నది. గోపిలాంటి నయవంచకులైన యువకులు, భూషణరావులాంటి మూఢాచార పరాయణులైన పెద్దలున్నంతవరకు ఈ సువిశాల పవిత్ర భారతంలో రోజుకు ఎందరెందరో వసంతల జీవితాలిలా మట్టిలో కలవాల్సిందే. ఈ ఘోరాన్ని చూడలేనన్నట్లు సూర్యుడు పడమట కొండకు తప్పుకొన్నాడు. దీర్ఘ నిట్టూర్పొకటి నా నాసికా పుటాల నుండి వెలువడింది. *

(అన్నపూర్ణ — మార్చి, ఏప్రిల్ 81)

—కాలువ మల్లయ్య